# సత్తా

"అడ్గోర్" రాజ్యంలో "డిడ్గోర్ పోలీస్" గూఢాచారి దళానికి "దొంగ" అని పేరు. దొంగ అంటే తెలుగు దొంగ కాదు. "డిడ్గోర్ ఆర్గనైజ్డ్ న్యూ గార్డ్స్ అకాడమీ" కి DONGA అన్నది ఎబ్రివియేషన్.

"పారుగ్" రాజ్యం నుంచి కొత్త రాయబారి. "కన్గార్" గారు అడ్గోర్‌లో దిగారు. రోజూ విశాలమైన తన యింటి నుంచి సువిశాలమైన కారులో మహావిశాలమైన ఆఫీసుకి వెళ్ళి వస్తుంటారు. ఆయనకి అన్ని వైభోగాలూ, అంగరంగంగా, అనంగరంగంగా సాగిపోసాగాయి. కారణం, పారుగ్ రాజ్యం సహకారం వల్లనే అడ్గోర్ రాజ్యం నడుస్తోంది.

హఠాత్తుగా ఓరోజు అర్ధరాత్రివేళ తన ప్లాటినం పెన్ను ఎక్కడో పోయిందని గుర్తించాడు కన్గార్ గారు.

వెంటనే డి.ఐ.జీ గారింట్లో ఫోను మ్రోగసాగింది. వెచ్చగా పడుకున్న డి.ఐ.జీ గారికి పిచ్చి కోపం వచ్చింది. తీరా ఫోన్ ఎత్తితే, పారుగ్ రాయబారి గొంతు!.... వెధవ్వేషాలేస్తే డొక్క చిరిగిపోతుంది...

అర్జంటుగా అన్నింటికీ, 'యస్సర్', 'అలాగే సర్', 'ఒ.కే.సర్' అంటూ "మీకెందుకు సార్! మీరు నిశ్చింతగా పడుకోండి. తెల్లవారేటప్పటికి దొంగలను పట్టుకుంటాం. అసలు మా ఆర్గనైజేషన్ పేరే "దొంగ" సార్! ఈ చిన్న చిన్న దొంగలు మా ముందు ఎంత సార్" అన్నాడు.

మర్నాడు నిద్రలేని కళ్ళతో ఆఫీసులో యిబ్బందిగా కదలసాగాడు. పారుగ్ రాయబారి గారు, 'యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్" వాళ్ళు తనకి "ది మోస్ట్ కేర్‌ఫుల్

ఇండివిద్యువల్ ఇన్ ది వరల్డ్" గా గుర్తించి, ఆ ప్లాటినం పెన్ను బహూకరించారు తనకి. అది తన బహిఃప్రాణం! తనేమో "మోస్ట్ కేర్‌లెస్" గా దాన్ని పారేసుకున్నాడు. ప్చ్! అడ్డంగా వున్న అర్జంట్ ఫైల్ ట్రే ని చిరాగ్గా అవతలకి నెట్టాడు. కళ్ళు జిగేల్ మన్నాయి. తన ప్లాటినం పెన్ను దీని క్రింద దూరిందన్నమాట! ఎంత పొరపాటుబడ్డాడు!

వెంటనే డి.ఐ.జి.కి రింగ్ చేశాడు. అవతలి నుంచి చాలా సేపటికి ఫోన్ ఎత్తబడింది. "హలో" అన్న కంఠం వినిపించింది.



"నేను పారుగ్ రాయబారిని..." మాట పూర్తికాకముందే అవతలి నుండి ఠపీమని ఓ శబ్దం వినిపించింది. కన్గార్‌గారు నవ్వుకున్నాడు. ఎవడో చిన్న ఆఫీసర్! "ఎటెన్షన్"

కొచ్చేసి ఫోన్‌లోనే సెల్యూట్ చేసేస్తున్నాడు. వెరీగుడ్! ఈ "దొంగ" పోలీసులకి పారుగ్ రాజ్యం అంటే ఎంత భక్తి!

అవతలి కంఠం మాట్లాడుతోంది. "నేను ఎస్.పీ.ని సర్! రాత్రి డి.ఐ.జీ గారు చెప్పారు సార్! మీ పని మీదే వున్నాం సార్! ఇప్పటికి అనుమానాస్పదులైన ఆరుగురిని పట్టుకున్నారు సర్! ఎలాగైతేనేం చివరికి అందులో ఇద్దరు నేరం ఒప్పుకున్నారు సర్! సాయంత్రానికిల్లా పెన్నుతో గాని, సొమ్ముతోగాని మీదగ్గరుంటాం సార్!..." ఇంకా ఎస్.పి. గారు మాట్లాడుతూనే వున్నారు. ఇంతలో బల్లమీద ఏదో బరువైన వస్తువు బలంగా పడ్డట్టు ఠపీమని ఫోనులోంచి ఓ శబ్దం వినబడింది. "పాపం పిచ్చిముండా కొడుకు! మూర్ఛపోయి వుంటాడు. మన సత్తా వాడికేం తెలుసు? అని ఫోను కేసి చూస్తూ నవ్వుకున్నాడు ఎస్.పీ.గారు.